


రెండుదిక్కుల రొండు స్పీకర్లు పెట్టుకుని ఒక జీపుకారు రాజధానికి ఎవరో ఒకపెద్దమనిషొస్తున్నడనీ, ఆయన నిజాంకాలేజీ గ్రౌండుల లెక్చరిస్తడనీ, అందరూ రాత్రి ఏడుగంటలకు అడికి రావాలని చెప్పుకుంట పోతున్నది. జీపుచుట్టూ చిన్నచిన్న పోరలు గుమిగూడి అండ్లకెలి కింద పడుతున్న కాయితాలను తీసుకుంటున్నరు. ఇండ్లల్లఉన్న ఆడమొగోల్లు బైటకొచ్చి జీపుకారు చెప్పుతున్న మాటలు వింటున్నరు. సదువొచ్చినోల్లు ఆ కాయితాలమీదున్నది సదువుకుంటున్నరు. రానోల్లు సదు వొచ్చినోల్లను అండ్ల ఏం రాసున్నదో అడిగి తెలుసుకుంటున్నరు.

ఈ తీరుగ ఆ రోజు పొద్మకొచ్చే పెద్దమనిషికోసం ఊరంత జోర్ దార్‌గ అడ్వటేజ్ జరుగుతున్నది.

* * *

మావూరికి లెక్చర్లిచ్చుటానికి పెద్దమనుషు లెప్పుడు రాలేదు. అండ్ల నేను పట్నమొచ్చినప్పటి నుంచి ఈడికికూడ ఎవ్వరు రాలేదు. అందుకని నాకు ఆ రోజొచ్చె పెద్దమనిషిని చూడాలని బాన ఖాయిష్ (కోరిక) పుట్టింది.

ఆ సంగతి మామకు చెప్పిన. మామ తనుకూడ నాతోటి వొస్తనన్నడు. ఇంక మంచిదేగద ననుకున్న.

* * *

నేనూ, మామా గౌలిపురలో చార్‌మినార్‌కు చారానకు రిక్ష మాట్లాడుకున్నం. ఆ రిక్ష మొగల్‌పుర తాటిచెట్టుకాడికి రాంగనే ముందటి పయ్యపంచరైంది. ఓరిభగవంతుడా! పోకపోక "పెద్ద మనిషిని" చూసుటానికి పోతుంటే టైరు పంచరై కూసున్నది. ఇగెట్లమరి, అని నేను సోచాయించుతుండంగనే మామన్నడు: "మనం ఉంకోరిక్ష కిరాయికి తీసుకుందాం."

కాని అంతట్లనే రిక్షోడు "నహీసాబ్, దో మినిట్‌మే జోడాదూంగా" అనుకుంటు మమ్ములను రిక్షలకెలి దించి జల్దిజల్ది టైరులోపటికెలి టీవు (ట్యూబ్)ను బైటికి గుంజి, దాన్ని జోడాయించుడు శురువుచేసిండు. వానితొందరను చూసి నాకు నవ్వొచ్చింది. చారానా పైసలుకోసం వానికెంత ఆరాటం! పాపం, ఈరిక్ష తొక్కేటోల్ల జిందగీలు ఎంతకష్టమైనవో చూడుండ్రి. పొద్దుగాల ఆరు గంటలనుంచి రాత్రి పన్నెండుగంటలదాక రిక్షలు తొక్కీతొక్కీ వాల్ల తలప్రాణాలు తోకకొస్తయి. అంతజేస్తె వాల్లకొచ్చేటియి రొండో మూడో రూపాయిలు. దాంట్లనే రిక్షకిరాయియ్యాలె. దాంట్లనే చుట్ట బీడీల ఖర్చులు పెట్టుకోవాలె. దాంట్లనే పెండ్లాం పిల్లలను సాదుకోవాలె! నిజంగ ఇవ్వన్ని చేసేందుకు కష్టమే!

ఇట్ల నేను సోచాయించుతుండంగనే రిక్షోడు పయ్యపంచర్ జోడాయించిండు. నేనూ, మామా రిక్షెక్కి చార్‌మినార్ చేరంగనే ఒక డబల్‌బస్సు బుర్రుమని చప్పుడుచేసింది జల్దిరాండ్రన్నట్టు. మేము జల్ది రిక్షదిగి వానికి పైసలిచ్చి బస్సందుకున్నం.

మేము గన్ ఫౌండ్రిలో బస్సుదిగేవరకు పొద్మకి ఆరైంది. అంటే లెక్చరిచ్చేటాయిన వొచ్చుటానికి ఇంక గంట టైమున్నదన్నమాట.

మేము దిగంగనే ఎదురుంగ నిజాంకాలేజి మొదటిగేటు రంగురంగుల పూలతోటి, ఆకులతోటి బొంబాట్‌గా సజాయించుకొని కనపడ్డది. ఆగేటుకు రెండుపక్కల పోలీస్‌జవాన్లు నిలబడిఉన్నరు. నేనూ, మామా ఆ గేట్లకెలి లోపటికిపోబోయినం. కాని పోలీసోల్లు అటకాయించిండ్రు.

"ఇటునుంచి రావొద్దు. బషీర్‌బాగ్ చౌరస్త కాడి గేటుకెలి లోపటికిరావలె. ఇటునుంచి పెద్ద పెద్ద మినిష్టర్ల కార్లల్ల లోపటి కొస్తరు" అని





చెప్పిండు ఒకపోలీసు.

ఇగ దేవుడా అనుకుంట కాలేజీ కాంపౌండు గోడెంబడే నడిచి బషీర్‌బాగ్ చౌరస్తాకాడి గేటు చేరుకున్నం. అండ్లకేలి గుంపులకొద్ది ఆడి మొగోల్లు లోపటికి పోతున్నరు.

"సైకిల్ ఇదర్‌లావో సాబ్! సిర్ఫ్ ఏకానా" అను కుంట సైకిల్ స్టాండోల్లు కొట్లాడుకుంట పబ్లిక్ సైకిల్లు గుంజుకపొయ్యి స్టాండుల పెడు తున్నరు.

మేము లోపటికి పోంగనే ఎదురుంగ కొంచెం దూరాన ఒకస్టేజీ, ముందట బోలెడంత పబ్లికూ కనిపించింది. గక్కున్నేరా మీటింగు జరిగేదనుకున్న.

ఇగ అక్కడ చేసిన ఏర్పాట్లనుగురించి జర్ర చెప్తాత వినుండ్రి.

స్టేజీ రెండుపక్కల రెండు స్తంభాలున్నై. వాటికి పద్దెనిమిదేసి స్పీకర్లున్నై. స్టేజీమీద శైన్లకొద్ది కుర్చీలేసున్నై. వాటిముందట ఒకకుర్చీ దాని ముందట ఒకటేబులూ ఉన్నై. టేబులు ముందట ఒక మైకున్నది. ఆ స్టేజీ ముందట చద్దర్లు పరిచిఉన్నై. అవి జర్రదూరం దాకనే ఉన్నై. ఆ ఉన్న జాగను రెండుభాగాలు చేసిండ్రు. ఒకదిక్కు ఆడోల్లున్నరు. ఉంకోదిక్కు పెద్ద మొగోల్లట...... ఉన్నరు. ఇగ స్టేజీమీది కుర్చీలల్ల తెల్ల షేర్వానీలు తొడుక్కున్న మంత్రులూ, నాయకులూ గిట్ల కూసున్నరు. ఇగ చద్దరోల్లల్ల వెనుక ఉన్న జాగల మామూలు మనుషులు కూసున్నరు. మామూలు మనుషులల్ల కొందరు కింద కూసుంటె మన్నంటుతదని నిల్చున్నరు. పోలీసులొచ్చి వాళ్లను కూసోమన్నరు.

"మీరుముందు కూసొని చూపెట్టుండ్రి" అని అన్నడు నిల్చున్నోల్లల్ల ఒకడు.

"మేము కూసుండుటానికి రాలేదు మిమ్ముల్ను కూసోబెట్టుటానికొచ్చినం" అన్నరు పోలీసులు.

"మేము పిలుచికే పోరగాండ్లం కాదు. మాకు కూసోవస్తది."

"అంత బుద్ధున్నోల్లైతె ఎందుకు కూసుంట లేరు."

"ఎవ్వనివిశే నివ్వు, మాబుద్ధి ఏంచుటానికి" అని ఉరిమిండు ఒక నౌజవాన్.

ఇదే సందని ఉంకో సైడ్వాను ఒకపోలీసు గల్లందుకొని ఒకగుద్దు గుద్దిండు. వాన్ని చూసి ధైర్యమొచ్చి మిగిలిన నిల్చున్నోల్లందరు పోలీసుల మీద విరుసుక పడ్డరు. ఆదెబ్బకు పోలీసులు బోర్లబొక్కలపడి మన్ను బుక్కిండ్రు.

ఇంతట్లనే ఇన్‌స్పెక్టర్లు, సబిన్‌స్పెక్టర్లు ఆడికి ఉరికొచ్చి ఆ కొట్లాటను ఆపు చేసిండ్రు.

ఈ తీరుగ అక్కడక్కడ పోలీసులకూ నౌజవాన్లకూ చిన్నచిన్న కొట్లాటలు శురువౌడూ ఇన్‌స్పెక్టర్లొచ్చి ఆపుచేసుడూ జరుగుతున్నది.

* * *

టైము ఏడున్నరయింది. ఏడింటికొస్తన్న "పెద్దమనిషి" ఏడున్నరైనా రాలేదు. అందుకని చూసుటానికికొచ్చిన పబ్లికులో చానమందికి సబర్ (ఓపిక) చచ్చిపోయింది.

"ఎంతకు రాడేందిరా, ఈ ఏడుపుమొఖపోడు"

"ఈ పెద్దమనుషుల లెక్కలే ఇంత. వస్త మనే టైమొకటి. వచ్చేటైమొకటి. నడుమ మనసోంటోల్లకే ఏడుపు."


"ఈ పెద్దమనుషుల పుటుకనే కిస్మత్ పుటుక రా! వాళ్లు కష్టపడి చేసేదేముండదికాని, వాళ్లు యాడికిపోయినా ప్రజలు వాళ్లను గుంజ్కక్కచ్చి కూసోపెడతరు."

"ఇంతచేస్తే వాల్లు చేసేది నోటి కొచ్చింది ఒక పది నిమిషాలు మొరిగి పోవుడే"

"గట్ల పనిపాటలు లేకపోబట్టే వాల్లకు బొర్రలు దిగుతై"

"జేబులుకూడ నిండుతై"

"వాళ్ల చుట్టాల జేబులుకూడ నిండుతై"



"గిట్లుంటది ఈ పెద్దమనుషుల తరీఖ"

ఈ తీరుగ పబ్లికులో అక్కడక్కడ చిన్న చిన్న కమేటీలు కూడి లెక్చర్లు శురువు చేసినై. ఇంక కొంతమంది పబ్లికుకు కూసుండి కూసుండి యాష్టొచ్చిందో ఏమో. ...వాటి వాటికి బైటికి లేసి పోతున్నరు. ఇస్త్రీబట్టలు తొడుక్కున్నోల్లు వాటి వాటికి లేసి, తాము కూసున్న జాగను సాఫ్‌గ తుడుచుకొని, దస్తీ పరుచుకొని కూసుంటున్నరు.

టైము పావుదక్కున ఎనిమిదైంది. ఇంకా ఆ వచ్చెటాయిన రాలేదు.

ఆయినకోసం ఎదురు చూసుకుంట కూసున్న పబ్లికులో చానమందికి యాష్ట పుట్టుకొచ్చింది. కొందరికి ఒంటేలుకు శురువైంది కొందరికి పాయిఖానకు శురువైంది. కొందరికి ఉడుకపోత శురువైంది. కొందరికి దూప (దాహం) శురువైంది. మరికొందరికి సిగిరేట్లొడిసిపోయినై. చిన్న

# మీటింగు

ులల్ల చాక్లెట్లొడిసిపోయినై. ఆడపిల్లల చేతులల్ల బరాశిలొడిసిపోయినై. అందుకని వాల్లందరు తమకు కావలసిన వస్తువులను కొనుక్కొచ్చుకునుటానికి పోతున్నరు. వాల్లు రాంగనే ఇంక కొందరు పోతున్నరు. ఈ తీరుగ స్టేజిముందట. పబ్లికంతా స్టేజికాడికీ, దుకాణాలకాడికీ పహరా ఇచ్చుడు శురువు చేసిండ్రు. ఇంతకూ మేమొచ్చింది మీటింగుకా, లేక తీర్థాని (తిరుణాల) కా అనిపించింది నాకు.

మొత్తంమీద పల్లికాయలోల్లకూ, చాక్లెట్లోల్లకూ, సిగిరెట్లోల్లకూ, సోడాలేమనోల్లకూ, చికిచికోల్లకూ (వేరుసెనగ—బెల్లం) బరాశోల్లకూ బోలెడంత గిరాకౌతున్నది.

టైము ఎనిమిదయ్యేవరకు బుర్రుమని "పెద్దమనిషి" మోటరొచ్చింది. పబ్లికుకు పోతున్న ప్రాణమొచ్చింది.


పెద్దమనిషి మోటరు దిగొచ్చి స్టేజెక్కిండు.

ఇంతట్లనే ఇన్‌స్పెక్టర్లు పోలీసులకు జర్ర బందోబస్తుగ ఉండుండ్రని, ఘాయిలు—ఘాయిలు జరుగకుండ చూడుండ్రని ఆడర్లిచ్చిండ్రు.

* * *

పెద్దమనిషి మైకుముందట నిల్చుండి లెక్చరు శురువు చేస్తడనంగనే "ఆచ్ఛ్" అని ఒక తుమ్ము తుమ్మిపారేసిండు ఒక బొర్రన్న. మంత్రి పాపం, ఏడ్పుమొఖం పెట్టిండు. ఇది గమనించిన ఇన్‌స్పెక్టర్లు పోలీసుల కిచ్చిన ఆర్డరు: "పబ్లికును తుమ్మనియ్యొద్దు."

పోలీసులు లాఠీకట్టె ఊపుకుంటు "తుమ్మితే తంతం" అన్నట్టు అటూ ఇటూ తిరుగుడు శురువు చేసిండ్రు.



# మీటింగు

ఆ(ఱ)సేపటికి ఆ వచ్చిన పెద్దమనిషి హిమ్మత్ (ధైర్యం) తెచ్చుకొని, లెక్చరు శురువుచేసిండు హిందిలో. హింది రానోల్లు ఆయన చేతులూపుడూ తలూపుడూ చూసుకుంటు కూసున్నరు. కాని, పెద్ద మనిషి లెక్చరుమీద చాన ఖాయిష్ ఉన్న కొందరు హిందిరానోల్లు పక్కకున్నోలను ఆయిన మాట్లాడే దాన్ని గురించి అడుగుతున్నరు. వాళ్ళు చెప్తుతున్నరు. ఈ అడుగుడూ—చెప్పుడూతోటి చిన్న చప్పుడు శురువైంది. ఆ చప్పుడు బంధుచెయ్యమని చెప్ప టానికి పోలీసులు కొంత చప్పుడు చెయ్యాల్సి వస్తు న్నది. ఆ రెండు చప్పుడులు కలిసి పెద్ద చప్పుడు శురువైంది. ఆ పెద్దచప్పుడులో పెద్దమనిషి చెప్పుడు ఎవరికీ వినొస్తలేదు. ఈ తీరుగ జరుగు తున్నది మీటింగు.

పెద్దమనిషి లెక్చరు శురువై పావుగంటైందో లేదోకాని, ముందట కూసున్నోల్లకు బయిటి కెల్ల టానికి శురువైంది. అందుకని వాల్లు తమ జాగ ల్లో దస్తీలో చెప్పులో, లేదా చిన్న పిలగాండ్లనో కూసోబెట్టి బైటికి పోతున్నరు. వాల్లట్ల పొయ్యే టప్పుడు ఏ పోలీసుకూడా రోకాయించుత లేదు. కాని వచ్చేటప్పుడుమాత్రం లోపటికి రానిస్తలేరు. అది వాల్లకు ఇన్‌స్పెక్టరిచ్చిన ఆడర (ఆర్డరు) ట.

"అరె, నా జాగలచెప్పు విడిసొచ్చిన"

"నాజాగల దస్తీ పరుచుకొనొచ్చిన"

"అక్కడ నా సంచి పెట్టుకొనొచ్చిన"

"లోపట చిన్న పిల్లలున్నరు. నేను పోకపోతే ఏడుస్తరు."

ఈ తీరుగ బైటికి పొయ్యినోల్లు పోలీసులతోటి మొరపెట్టుకుంటున్నరు. కాని చెప్పినట్టుచేసుడు తప్ప సోంచాయించే బుర్రలులేని ఆ పోలీసులకు ప్రజల అరుపులు చెవి కెక్కుతయా!

"అవన్నీ ఏం పనికిరావు. లెక్చరైనంకనే లోపటికి పోవాలె"

"లోపట పిలగాండ్లు ఏడుస్తరయ్యా, నేను పోకపోతే" అడిగిండు ఒకాయిన పోలీసులను.

"ఏడుస్తే మేము ఊకుంచుతం తియ్య" పోలీ సుల జవాబు.

"లోపట నా చెప్పులు ఎవరన్న తొడుక్క పోతరు."

"ఎవ్వరు తొడుక్కపోకుంట మేము చూస్తం" ఇట్లున్నై పోలీసుల జవాబులు. లోపల వాల్ల నాయినలు రాలేదని ఏడ్చేపిల్లలు పోలీసోల్లు ఊకుం చుతే ఊకుంటరా! లోపటున్న ఏ చెప్పులు, ఏ దస్తీలు బైటున్న ఎవరెవరికి సంబంధినయో ఎట్ల తెలుసుకుంట రీ పోలీసులు.

"లెక్చరినటానికొస్తే గిదా శాస్తి" అన్నా డొకా యిన.

"అయితే ఉంకోసారి రాకు" పోలీసు జవాబు.

"ఇంక సిగ్గులేక ఉంకోసారొస్తమా. ఇప్పు డొచ్చింది చాలు" అనుకుంటు కొందరు ఇంటి దారి పట్టిండ్రు. కాని లోపట చెప్పులూ, పిల్లలూ ఉన్నోల్లుమాత్రం చిత్తం "పెద్దమనిషి" మీదా, భక్తి చెప్పులమీదా, పిల్లలమీదా పెట్టుకుని అక్కన్నే నిల్చున్నరు.

ఈ తీరుగ సాగుతున్న పోలీసుల అజమాయిషీ పుణ్యమా అంటూ "పెద్దమనిషి" ముందటున్న చద్దర్లన్నీ ఖాళీ అయిపోయినై. మనుష్యులులేని చద్దర్లను చూసేవరకు పెద్దమనిషికి మతిపోయి నట్టైంది. తన లెక్చరుముందట్ల కూసున్నో ల్లను ఎగురగొట్టేటంత జోరిదార్‌గ ఉన్నదా, అనుకున్నడు.

ఆయన లెక్చరు శురువైన అర్ధగంటకు, బైటికి పోయిన తండ్రులు ఇంకా రాలేదని చిన్న పిల్లలు తీరు తీరు రాగాలు శురువు చేసిండ్రు. వాల్లను ఊకోబెట్టాలని పోలీసులు చేస్తున్న అల్లరి కోకిల పాటల నడుమ గాడిద అరిచినట్లున్నది.

ఇక ఇన్ని రాగాల నడుమ నా రాగాన్ని వినేటో డెవ్వడని తెలుసుకున్న పెద్దమనిషి తన రాగాన్ని ఆపుచేసి, టేబల్‌మీదున్న గ్లాసెడు నీల్లు గడగడ తాగి స్టేజిమీది కెలి చల్లగ జారుకున్నడు.

మీటింగైందని కూచున్నోల్లందరు లేచిండ్రు. పోలీసులు తొవ్వలు కుల్ల చేసిండ్రు. పట్లికు ఒకనిమీద ఒకడు పడుకుంట లేచుకుంట లోపటి కురికిండ్రు. అట్ల ఉరుకుటల్లల్ల ఒకనిమీద ఒకడు పడి పండ్లు రాలగొట్టుకుంటున్నరు. నేనూ మామమాత్రం దూరానైనా, ఏమైనా అట్లే కూచున్నాం కాబట్టి మా వస్తువులేం పోలేదు. కాని, మీటింగంటే నాకు బడే బోరింగనిపించింది. దానితర్వాత నేను ఏ మీటింగుకు పోలేదు. ★



తెలుగు వారపత్రికలన్నిటిలో 'ఆంధ్రసచిత్ర వారపత్రిక' సర్క్యులేషన్ అత్యధికమైనది. ప్రకటనలను ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వేసి మీ వ్యాపారం అభివృద్ధి చేసుకొనండి. వివరాలకు అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్ 'ఆంధ్రసచిత్ర వారపత్రిక' 7, తంబుచెట్టివీధి, మద్రాసు-1 కి వ్రాయండి.

## మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు - మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు - రూ. 3-50
యువతి - స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు రూ. 3-50
సంతానము - గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు. రూ. 3-50
అమ్మకపు రహస్యాలు - వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రూ. 6-00
ఉద్యోగదర్శిని.- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ. 5-00
ఆత్మజ్ఞానము :- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ. 2-50
పోష్టు ఖర్చులుచితం క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి. పి. పోస్టుద్వారా మీయింటికి పంపబడును
దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర

## మంచి రహస్యం

గ్లోరింయా ద్రవాన్ని, మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలో ముడిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే నలుపును, మొటిమలను నిశ్శేషంగా పోగొట్టును. వెల రూ. 1-75. అన్ని షాపుల్లో దొరుకును.
JANITA PRODUCTS, ELURU. A P.




## డాక్టర్ వృత్తి చేయండి!



విరామ కాలంలో ఇంటిలో పోస్టల్ ట్యూషన్ ద్వారా హోమియోపతి చదివి, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి.
ప్రాస్పెక్టస్ ఉచితం వెంట కోరాయండి
INDIAN HOMOEOPATHIC COLLEGE
(APW) JULLUNDUR CITY